
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శనివారం 2 నవంబరు 2024



న్యూస్ బాక్స్

రేపు ఎంపిక పోటీలు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీ అంబేద్కర్ యూత్ బాల్‌బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో సీనియర్స్ బాల్ బ్యాడ్మింటన్(పురుషులు-మహిళలు) ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బంగారు స్వామి, ప్రధాన కార్యదర్శి డి.దుర్గయ్య ఒక ప్రకటన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వైట్ యూనిఫాం, ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 8వ తేది నుంచి 10వ తేది వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఎలిగేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివపల్లి గ్రామంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న చత్తీస్‌గఢ్ కూలీల ఆరోగ్య పరిరక్షణకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ నిస్సి క్రిష్టాన తెలిపారు. శిబిరంలో 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రక్తహీనత ఉన్న మహిళలకు మాత్రలు పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు మల్టీ విటమిన్ సిరప్‌లు, జలుబుకు సిరప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విజేందర్‌రాజ్, సూపర్‌వైజర్ లక్ష్మణ్, నాగమణి, ఏఎన్ఎం అమృత, ఆశాకార్యకర్త రాధిక తదితరులు పాల్గొన్నారు.

పూచీకత్తులో జాప్యం

- మిల్లర్లకు ధాన్యం కేటాయించని ప్రభుత్వం
- వర్షాలతో ఆందోళన చెందుతున్న రైతులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రైస్ మిల్లర్లు పూచీకత్తు ఇవ్వనిదే సీఎంఆర్ కింద ధాన్యం కేటాయించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ఈ కారణంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగకపోగా, అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి పాలకుర్తి, అంతర్గాం, రామగుండం, పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగిరి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, మంథని, ముత్తారం తదితర మండలాల్లో కురిసిన వర్షాలతో కోతకు వచ్చిన వరి పొలాలు నేలవాలాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు విక్రయానికి తీసుక వచ్చిన ధాన్యం తడుస్తుండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. కొందరు రైతులు చేసేదేమిలేక పచ్చి ధాన్యాన్ని తక్కువ ధరకే రైస్ మిల్లర్లకు విక్రయి స్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2 లక్షల 9 వేల 542 ఎకరాల్లో వరి సాగు చేశారు. తద్వారా 4 లక్షల 50 వేల టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈసారి సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో 78 శాతం వరకు సన్న రకం వరి ధాన్యాన్నే రైతులు సాగు చేశారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని జిల్లా అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు జిల్లాలో 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చారు. కొంత మంది రైతులు ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు విక్రయిస్తు న్నారు. పచ్చి వడ్లను మిల్లర్లు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. 17 శాతానికి మించి తేమ శాతం ఉండడం, దీనికి తోడు అకాల వర్షాలు పడుతుండ డంతో పలువురు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించడం లేదు.

● తక్కువ ధర వచ్చినా..

కొనుగోలు కేంద్రాలకు తీసుకవెళితే ధాన్యం తడుస్తుందని రైతులు తక్కువ ధర వచ్చినా కూడా మిల్లర్లకు విక్రయిస్తున్నారు. దొడ్డు రకం వడ్లు క్వింటాలుకు 1900 నుంచి 2 వేల రూపాయల వరకు, సన్న రకం వడ్లు 2100 నుంచి 2200 రూపాయలకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యానికి నిర్ధేశించిన తేమ శాతం ఉన్నా కూడా కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. సీఎంఆర్ పాలసీని ప్రభుత్వం ఆలస్యంగా విడుదల చేయడమే కారణమని తెలుస్తున్నది. ఆయా రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలంటే బ్యాంకు గ్యారంటీ అయినా ఇవ్వాలని, లేదంటే 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చూపెట్టాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో ఇంకా మిల్లర్లు పూచీకత్తులు ఇవ్వలేదు. ఆ కారణంగా కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నది. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చే మిల్లర్లకే అధికారులు ధాన్యం కేటాయించనున్నారు. అయితే రైస్‌మిల్లర్లు

మిగతా 8వ పేజీలో...



రేవంత్ సర్కార్‌తో ఆటోడ్రైవర్ల బతుకులు ఆగం..

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

8



కులాలవారీగా లెక్కతేలితేనే సమన్యాయం

- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

7

ఘనంగా దీపావళి వేడుకలు

- ఆకట్టుకున్న బొమ్మల కొలువులు
- భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మి పూజలు, కేదారేశ్వర నోములు



గోదావరిఖనిలో బొమ్మల కొలువు



ఆశ్రమంలో పిల్లలతో కలిసి టపాసులు కాలుస్తున్న మనలీఠాకూర్



టపాసులు కాలుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదిన వేడుకలు గురువారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ప్రత్యేకంగా లక్ష్మీపూజలు, నోములు చేశారు. సాయంత్రం కాలనీల్లో ఇళ్లను అందంగా రంగురంగుల లైట్లతో అలంకరించారు. దీపాలు వెలిగించి ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల మధ్య బాణాసంచాలు కాల్చారు. అలాగే ఇళ్లలో బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. అలాగే ఈసారి తిథి రెండురోజుల్లో రావడం వల్ల గురువారంతో పాటు శుక్రవారం కూడా రెండు రోజుల దీపావళిగా జరుపుకున్నారు. అలాగే నోములు, పూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. కాగా బాణాసంచా దుకాణాలు కొనుగోళ్లతో కిక్కిరిసిపోయాయి.

అమ్మ పరివార్ ఆశ్రమంలో...

గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అమ్మ పరివార్ ఆశ్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ శుక్రవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. పిల్లలకు స్వీట్లు అందజేసి వారికి కలిసి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ఆశ్రమ పిల్లలతో కలిసి పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, పిల్లలు పాల్గొన్నారు.



మంథని శ్రీమహాలక్ష్మి ఆలయంలో ధనలక్ష్మి పూజ

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం దీపావళి వేడుకలు దేదీప్యమానంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారందరూ తమ స్వగ్రామాలకు తరలివచ్చి కుటుంబాల వారిగా అత్యంత భక్తి శ్రద్ధలతో కేదారేశ్వరి వ్రత సంకల్పాన్ని నిర్వహించారు. దీపావళికి ఇతర ప్రాంతాల నుండి తమ స్వంత గ్రామాలకు తరలిరావడంతో గ్రామాల్లో వీధులన్ని చిన్నారులు, యువతులతో సందడి నెలకొంది. అలాగే ప్రతి ఇంటి వాకిళ్ల ముంగిట దీపాల అలంకరణతో గ్రామాలు కళకళలాడాయి. గ్రామాల్లో చిన్న, పెద్ద తేడాలేకుండా బాణసంచా పేల్చుతూ వీధుల్లో యువకుల, చిన్నారుల కేరింతలతో దీపావళి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు చేరుకొని కేదారేశ్వర స్వామి వ్రత పూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో సుదూర ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరుకోవడంలో సందడి వాతావరణం నెలకొంది.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురు,శుక్రవారాలలో ప్రజలు దీపావళి పండుగ, నోముల వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. దీపావళి వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఇంటిలో దీపాలను వెలిగించి, మామిడి ఆకు తోరణాలు, రంగురంగుల పూలతో అలంకరించి సుందరవనంగా తయారుచేసుకున్నారు. ప్రతి ఇంటి వాకిట్లో టపాసుల చప్పుల్లు, కాకరవత్తులతో పిల్లల సందడి ఆనందాన్ని నింపాయి.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురు, శుక్రవారల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. కొత్త బట్టలు ధరించి ఇళ్లలో, వ్యాపార వాణిజ్య దుకాణాలు, సంస్థల్లో కుటుంబ సభ్యులు వ్యాపార భాగస్వాములతో కలసి లక్ష్మీ పూజలు చేసుకున్నారు. ఆలయాలు సందర్శించి స్వామి వారిని అమ్మ వారిని దర్శనం చేసుకున్నారు. కొత్త అల్లుళ్లు కలిగిన కుటుంబాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. శుక్రవారం ఇంటింటా కేదారేశ్వర నోములను ప్రజలు నోచుకున్నారు. ఈ ఏడాది స్వాతి నక్షత్రం కూడా వస్తుండడంతో చాలా మంది కొత్త నోములతో పాటు గతంలో కొన్ని కారణాల రీత్యా పడిపోయిన నోములను కూడా ఈసారి నోముకున్నారు. ఇంటింటా నోములతో కుటుంబ సభ్యులు సందడి సందడితో గడిపారు. మరోవైపు బాణసంచా కాల్చడాలు చిన్నారుల సంబరాలు అంబరాన్ని అంటాయి.

దీపావళి పర్వదినం, కేదారేశ్వర స్వామి వ్రతాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు వ్రతం నిర్వహించారు. అనంతరం టపాసులు కాల్చి దీపావళి పండుగను కుటుంబ సభ్యుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గురు, శుక్రవారాలు రెండురోజులు దీపావళి సంబరాలను ప్రజలు నిర్వహించుకున్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఇళ్లముందు దీపాలతో అలంకరించి ప్రత్యేక నోములు నోచారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు, మహిళలు, టపాకాయలు కాలుస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి) : మండలంలో దీపావళి వేడుకలను ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మచ్చుపేట శివారులోని బగుళ్లగుట్టలో పుణ్యస్నానాలను ఆచరించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. సాయంత్రం బానసంచా కాల్చి పండగ జరుపుకున్నారు. పలువురు కేదారేశ్వర వ్రతం చేసుకొని శుక్రవారం మొక్కులు చెల్లించారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లోని వివిధ మండలాల ప్రజలు గురు, శుక్రవారాల్లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దీపావళిని పురస్కరించుకొని ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలుతో పాటు ఇళ్లలో, షాపుల్లో ధనలక్ష్మీ పూజలను నిర్వహించారు. స్థానిక శ్రీమహాలక్ష్మీ, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీ ఆలయ ఆవరణలో భక్తులు లక్ష్మీపూజ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి ఇండ్లు, షాపుల ముందు బాణాసంచా పేల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి ఇంట్లో జరిగిన లక్ష్మీపూజ అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి టపాసులు దీపావళి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ప్రజలు, అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధులు వేర్వేరుగా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థినులను పరామర్శించిన మంత్రి



విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అస్వస్థతకు గురైన ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థినులకు పూర్తి స్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యార్థినులు అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థినులు రక్షిత, రేవతి, సునీతలను మంత్రి గురువారం పరామర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అపాయం లేదని, వారు పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని, అనంతరం విద్యార్థులను ఇంటికి పంపిస్తామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ చీఫ్ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉన్నారు.

సింగరేణిలో అధికారుల బదిలీలు

గోదావరిఖని, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పలువురు జీఎంలు, మైనింగ్, పర్సనల్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. రామగుండం ఏరియా-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా, భూపాలపల్లి జీఎం హబీబ్‌హుస్సేన్ హెచ్‌ఆర్‌డీ జీఎంగా బదిలీఅయ్యారు. ఎస్టేట్స్ జీఎం టీ వెంకటయ్య ఆర్జీ-2 ఏరియా జీఎంగా, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ జీఎంగా పనిచేస్తున్న సుశాంత సాహ బెల్లంపల్లి రీజయన్ క్వాలిటీ జీఎంగా బదిలీ అయ్యారు. కృష్ణయ్య కార్పొరేట్ హెచ్‌ఆర్డీ విభాగం నుంచి ఇల్లందుకు, నైనీబ్లాక్ ఏజీఎంగా పనిచేస్తున్న సుజోయ్ ముజుందార్ అదే బ్లాక్‌లో పదోన్నతి పొందారు. మందమర్రి ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి భూపాలపల్లి జీఎంగా, ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ ఎస్టేట్ విభాగానికి బదిలీ అయ్యారు. జీఎం సెక్యూరిటీ శ్రీనివాసరావు పర్సనల్, వెల్ఫేర్ విభాగానికి, హెచ్‌ఆర్‌డీ విభాగం ఏజీఎం లక్ష్మీనారాయణ సెక్యూరిటీ విభాగానికి బదిలీ అయ్యారు.

ఎన్‌టీపీసీ ఈడీకి పదోన్నతి



కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుకు పదోన్నతి లభించింది. సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఎన్‌టీపీసీ కార్పొరేట్ నుండి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటివరకు ఆర్ఈడీ(సౌత్)గా విధులు నిర్వహించిన ప్రేమ్ ప్రకాష్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రామగుండం ప్లాంట్ ఈడీ అయిన కేదార్ రంజన్‌పాండు ఆర్ఈడీగా బాధ్యతలు అప్పగించారు.

బ్లడ్ బ్యాంకును సందర్శించిన సెంట్రల్ డీఐ



ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న డీఐ సంగ్రామ్

కళ్యాణ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకును శుక్రవారం సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) సంగ్రామ్ సందర్శించారు. ప్రభుత్వాసుపత్రి జనరల్ ఆసుపత్రిగా మారిన తరువాత కొత్తగా లైసెన్స్‌తో పాటు యంత్రాలు పెట్టుకోవడానికి అనుమతులు కావాల్సి ఉండగా సంగ్రామ్ ఆసుపత్రిలోని వసతులపై తనిఖీలు నిర్వహించారు. గతంలో బ్లడ్ స్టోరేజీ మాత్రమే ఉండేది. ఆసుపత్రి 360పడకలకు విస్తరించిన తరువాత రోగులకు సరైన సమయంలో రక్తం లభించకపోవడంతో ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని విస్తరించనున్నారు. ప్లేట్‌లెట్స్, ఆర్‌బీఎస్ యంత్రాలు ఆసుపత్రికి రానున్నాయి. దీంతో ఇక్కడ రక్త నిల్వ కేంద్రం విస్తరించనున్నది. వెంట పెద్దపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, మెడికల్ ఆఫీసర్ జ్యోతి, స్వాతి, అముల్ కుమార్, ఓబులేష్, ల్యాబ్ ఇన్‌చార్జిలు అన్వర్, సంపత్, శివ, స్రవంతి ఉన్నారు.

ప్రలోభాలకు లొంగి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రలోభాలకు లొంగి హోంగార్డులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. గురువారం రామగుండం కమిషనరేట్‌లో పనిచేస్తున్న హోంగార్డులతో దర్బార్ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హోంగార్డులు కూడా పోలీస్ శాఖలో అంతర్‌భాగమని, వారు కూడా పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితుల్లో కూడా వివిధ బందోబస్తుల్లో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. పోలీస్‌శాఖలో పని చేస్తు న్నప్పుడు నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించరాదని, డ్యూటీలో ఉన్నా, ఆఫ్‌డ్యూటీలో ఉన్నా పోలీస్ శాఖ పరువుకు భంగం కలిగించరాదన్నారు. కొంత మంది వారి స్వలాభాల కోసం ప్రలోభాలకు గురి చేస్తే యూనిఫాం సర్వీస్‌లో ఉండి నిరసనలు చేయవద్దన్నారు. క్రమశిక్షణ కలిగి పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధనలను అతిక్రమిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. హోంగార్డులకు ఏమైనా సమస్యలుంటే ఏసీపీలకు, డీసీపీలకు లేదా సీపీ కార్యాలయంలో నేరుగా వచ్చి తెలుపాలని సూచించారు. పోలీస్ శాఖకు మచ్చతెచ్చే విధంగా వ్యవహరించవద్దన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన కాల వ్యవధిలో ప్రణాళికా బద్ధంగా ఇంటింటా కుటుంబ సర్వే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ఆదేశించారు. శుక్రవారం ఆర్‌జీ-1 కమ్యూనిటీ హాల్‌లో ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో అన్ని ఇళ్లను సందర్శించి సర్వే నిర్వహించాలన్నారు. సర్వే షెడ్యూల్ ముందుగా తెలియజేసి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాస్‌బుక్ అందుబాటులో ఉండేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ లింగారెడ్డి, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఈఈ రామన్, ఆర్ఐ శంకర్‌రావు, కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 65.847 ఇళ్లు..

నగర పాలక సంస్థలోని 50డివిజన్లలో మొత్తం 65,847 ఇళ్లు ఉన్నాయని, వీటిని 150 నుంచి 175వరకు ఒక బ్లాక్ చొప్పున 446 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించి ఒక్కొక్క బ్లాక్‌కు ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు సర్వే నిధులు కేటాయించినట్టు అదనపు కలెక్టర్ అరుణశ్రీ తెలిపారు. సర్వే నిర్వహణ తీరును పర్యవేక్షించడానికి 51మంది సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించామని, సర్వే సామగ్రి కూడా అందజేసినట్టు తెలిపారు. హౌస్ లిస్టులో భాగంగా సర్వే ప్రారంభానికి ముందు ఇంటింటికి వెళ్లి సర్వే ఉద్దేశ్యాన్ని యజమానికి వివరించాలన్నారు.

సీఎం, మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

గోదావరిఖని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను, మంత్రి శ్రీధర్‌బాబు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రామగుండంకు మరిన్ని నిధులు మంజూరుచేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యునికేషన్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ బ్యాచ్‌లో అడ్మిషనర్ల కోసం నవంబరు 25 వ తేదీలోగా తమ దరఖాస్తులను తెలుగు విభాగంలో కన్వీనర్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ అందజేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామ శివారులో కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో దొడ్డె మధుకు తీవ్ర గాయాలయ్యాయి. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన మధు బైక్‌పై వీణవంక వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్ (ఏపీ15టీ 5297) బైక్‌ను ఢీకొట్టింది. కింద పడిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామగుడు, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఓ వైపు వృద్ధాప్యం, మరోవైపు అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన పెద్దిగారి ఎల్లయ్య(85) మధుమేహంతో పాటు మానసిక సమస్యలతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం దీపావళి పండుగ వేళ ఎల్లయ్య తన బైక్‌పై ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మీపూర్ శివారులోని గ్రావిటీ కెనాల్ బ్రిడ్జి వద్ద ఎల్లయ్య వాహనం, చెప్పులు కనిపించాయి. దీంతో కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. అనారోగ్య సమస్యల మూలంగా తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఎల్లయ్య కుమారుడు బీరయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణుల వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బురడా, మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లావక్క, సొజ్జబూరెలు, పునుకులు, దోసకాయ వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, పొట్లకాయపచ్చడి, గారెబోండలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లా పిరువ కాయలు, ముద్దపప్పుకూర, పెసరిపిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి. ఎంతో రుచిగా ఘుమఘుమలాడే బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం ఫిదా అయ్యారంటే అతిశయోక్తి కాదు.

మంథని రుచులు అదుర్స్



ఆలుబాత్ రైస్



మోతిచూర లడ్డు

- బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ సైతం ఫిదా..
- మంథని వంటకాలకు ప్రత్యేక గుర్తింపు

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సహజంగా బూడిద గుమ్మడికాయను దిష్టి తగలకుండా ఇంటి ముందు గుమ్మాలకు వేలాడదీస్తారు. నూతన గృహ ప్రవేశాలు, వాహన పూజలకు సైతం వినియోగిస్తారు. కానీ ఇదే బూడిద గుమ్మడికాయతో "గుమ్మడికాయ బరడా"గా పిలిచే వంటకాన్ని తయారు చేయడం పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణ కుటుంబాల ప్రత్యేకత. వంటల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలాగే మంథని ప్రాంత వంటకాలు సైతం ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బరడాతో పాటు మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లా వక్క, సొజ్జబూరెలు, పునుకులు, బోడకాకర, పాలకూర, దోసకా య వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, చింతపండు పులుసు, ఆవకాయ, పొట్లకాయ పచ్చడి, గారెబోండాలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లపిరువకాయలు, ముద్దపప్పుకూర, పెసరి పిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి.

మంథనిలోని బ్రాహ్మణ కుటుం బాలు బూడిద గుమ్మడికాయతో ఘుమఘుమలాడే బరడా వంటకాన్ని తయారు చేసుకొని తినడం సంప్రదాయంగా వస్తోంది. వృత్తి, వ్యాపార రీత్యా దేశవిదేశాల్లో స్థిరపడ్డ మంథని బ్రాహ్మణ కుటుంబాలు బూడిద గుమ్మడికాయ బరడా వంటకాన్ని ఇప్పటికీ ఆరగిస్తున్నారంటే ఆ వంటకానికి ఉన్న ప్రత్యేకత అర్థం చేసుకోవచ్చు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆచార్యులు, వేద పండితులు, పీఠాధిపతులను మంథనికి ఆహ్వానిస్తే.. "బూడిద గుమ్మడికాయ బరడా భోజనం పెడతారా.." అంటూ నవ్వుతూ ప్రశ్నించేవారట.

- ప్రముఖులు సైతం ఫిదా..

మంథని నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన



వంటలు చేస్తున్న మంథనికి చెందిన రాజు



సొజ్జ బూరెలు

స్వర్గీయ పీవీ నర్సింహారావు బూడిద గుమ్మడికాయ బరడాను అత్యంత ఇష్టంగా తినేవారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో మంథనికి చెందిన బ్రాహ్మణులు బరడా వంటకం తయారీ కోసం ఢిల్లీలో ఉండేవారంటే అతిశయోక్తి కాదు. మంథని మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావుకు సైతం బూడిద గుమ్మడికాయ బురడా అంటే చాలా ఇష్టం. అంతేకాదు మంథనిలోని చాలా మంది ఇళ్లలో వారంలో ఏదో ఒక రోజు తప్పనిసరిగా బూడిద గుమ్మడికాయ బురడాను వండుకొని తింటారు. అలాగే వివాహాలు, వడుగు, గృహప్రవేశాలు, నోములు, వ్రతాలతో పాటు అన్నదాన కార్యక్రమాల్లోనూ బూడిద గుమ్మడికాయ బరడా కూర వడ్డించడం విశేషం.

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఎస్‌జీఎఫ్ అండర్-17,-19 రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు గంభీరావుపేట కేజీబీవీ క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-17 40 కేజీల విభాగంలో మౌనిక, 44 కేజీ విభాగంలో దీపిక, 48 కేజీ విభాగంలో సోనీ, 56 కేజీ విభాగంలో చరణ్య ఉమ్మడి జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. 48 కేజీల విభాగంలో అస్మిత కాంస్య, 52 కేజీ విభాగంలో వైష్ణవి వెండి పతకాలు సాధించారు. అండర్-19లో 60 కేజీ విభాగంలో ఇందు స్వర్ణం సాధించినట్లు పీఈటీ స్వప్నరెడ్డి తెలిపారు. వీరంతా శనివారం మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఉషు పోటీల్లో పాల్గొననున్నారు.

ఆర్టీసీ రీజినల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా మనోహర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జి.మనోహర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన చీకోటి వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మనోహర్‌రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డిని ఆర్టీసీ అధికారులు బి మొగిళి, కిరణ్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మనోహర్‌రెడ్డి డిప్యూటి రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

సూక్ష్మ కళలో నైపుణ్యం

- ప్రపంచ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో విష్ణుకు చోటు
- అవార్డులు, సత్కారాలు
- బాల్యం నుంచే సూక్ష్మ దృష్టి

కథలాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచి ఇంటి వద్ద ఇనుప పరికరాలను తన తండ్రి సానబెడుతూ సాగదీయడాన్ని శ్రద్ధగా గమనించిన ఆ యువకుడు 'సూక్ష్మ' దృష్టి సారించాడు. వ్యవసాయానికి పనికి వచ్చే రకరకాల పరికరాలను కాలుతున్న కొలిమిలో పదేపదే పరీక్షగాచూసి కొత్త ఆలోచనలకు ఊపిరి పోశాడు. తన అద్భుత తయారీ విధానంతో ఏకంగా వండర్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు మండలంలోని తాండ్ర్యాలకు చెందిన బండెడ్ల విష్ణు.

- కొంగొత్త పరికరాల రూపకల్పన

తండ్రి స్వతహాగా కమ్మరి వృత్తిలో ఉండడంతో వస్తువుల తయారీ సులువుగా నేర్చుకున్న విష్ణు తనదైన శైలితో ఏదోరకంగా ప్రత్యేకత చాటుకోవాలని చిన్ననాటి నుంచే ఉత్సాహం కనబరిచాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో తండ్రి మరింత ప్రోత్సాహం అందించాడు. చదువు మానేసాక కుల వృత్తిలోనే స్థిర



గోరుపై ఇమిడే గొడ్డలి, కొడవలి పరికరాలు

పడాలని నిర్ణయించుకుని కొలిమిలో ప్రయోగాలకు శ్రీకారం చుట్టాడు. గోరుపై ఇమిడే అతి చిన్న



చిన్న సైజ్‌లో తయారుచేసిన ఎడ్లు, కచ్చురం

కొడవలి, గొడ్డలి, కురిపె, కొంక తయారు చేసి పలువురిని అబ్బురపరిచాడు. అగ్గిపెట్టెలో ఇమిడే వివిధ రకాల పరికరాలను రూపొందించాడు. సెంటీమీటర్ పొడవున్న అమర వీరుల స్థూపం, శివలింగం వంటివి తయారు చేశాడు. విష్ణు ప్రతిభను తెలుసుకున్న రాష్ట్ర కళా విభాగానికి చెందిన బృందం తాండ్ర్యాలకు వచ్చి స్వయంగా పరిశీలించింది. 2016లో తెలంగాణ రాష్ట్ర రికార్డుగా నమోదు చేసుకున్నారు. 2021లో ఇందిరాగాంధీ సద్భావన అవార్డు సొంతం చేసుకున్నాడు.

- నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలనే..

తండ్రి వృత్తి రీత్యా కమ్మరి కావడం మూలాన వ్యవసాయానికి వినియోగించే పరికరాలను తయారు చేయడాన్ని దగ్గరి నుంచి చూశాను. ఒకరోజు మా నాన్న కొలిమిలో లేని సమయంలో చిన్న వస్తువులను తయారు చేశాను. అందరూ చూసి నన్ను మెచ్చుకున్నారు. అదే స్ఫూర్తిగా అనేక సూక్ష్మ వస్తువులను తయారు చేశాను.



\- విష్ణు, కళాకారుడు

అకాల వర్షంతో వరి పంటకు నష్టం

- నేలవాలిన వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు



మర్రివానిపల్లెలో నేలవాలిన వరి పొలాన్ని చూసి బోరున విలపిస్తున్న రైతు

ఇల్లందకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట దెబ్బతిన్నది. మండలంలోని రైతులు సుమారు 7,800 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మర్రివానిపల్లె, సిరిసేడు, ఇల్లందకుంట తదితర గ్రామాల్లోని వరి పంట నేలకొరిగింది. మర్రివానిపల్లె గ్రామంలో 65ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న వ్యవసాయ విస్తరణాధికారి మమత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టం వివరాలను అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కోతకు వచ్చిన పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

వెల్గటూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్ట పడి పండించిన వరి చేతికి వచ్చే సమయంలో నేల వాలడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో శుక్రవారం ఉదయం కురిసిన చిరు జల్లులకు గాలి తోడు కావడంతో చాలా చోట్ల వరి నేల వాలింది. అసలే సరియైన వర్షాలు లేక కష్ట పడి పండించిన పంటలను అకాల వర్షం రూపంలో నష్టం కలుగుతుందని రైతన్నలు వాపోతున్నారు.

సారంగాపూర్, నవవబరు, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వర్షం కురువడంతో కోత కోతకు వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరగబోసిన ధాన్యం కుప్పల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఇబ్బందులుపడుతూ తమ ధాన్యం తడవకుండా కవర్లు కప్పుతూ తంటాలు పడ్డారు. ఇంకా కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. వెంటనే ప్రారంభించి కొనుగోళ్లు జరిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్, పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు గ్రామాల్లోని రెండో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పెద్దూర్, చిన్నబోనాల గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని వార్డు కౌన్సిలర్లు బొల్గం నాగరాజుగౌడ్, లింగంపల్లి సత్యనారాయణ, పాతూరి రాజిరెడ్డి, పోచవేని సత్యఎల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎరవెళ్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ పరిశీలించారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం వర్షానికి కొట్టుకు పోయింది. దీంతో సుమారు 50 క్వింటాళ్ల ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల రంగంపేటలో రైతులు తడిసి కొట్టుకుపోయిన ధాన్యాన్ని నీటినుంచి ఎత్తుకున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సింగిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసింది.



వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి వద్ద నేల వాలిన వరి పైరు



సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం



సిరిసిల్ల చిన్నబోనాలలో అకాల వర్షానికి నెలకొరిగిన వరి పంట

మహిళ అదృశ్యం



స్వప్న(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన నేరెళ్ళ స్వప్న(31) అనే అవివాహిత మహిళ అక్టోబరు 29వ తేదీనుంచి అదృశ్యమైందని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. స్వప్న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాపోకవడంతో ఫిర్యాదు చేశారని చెప్పారు. స్వప్నకు కొంత కాలం నుంచి మతి స్థిమితంగా లేదని తెలిపారు. గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులకు 8712670765 నంబరుకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

- రూ.4.50లక్షల కాపర్ వైర్ స్వాధీనం



ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చూపుతున్న పోలీస్‌లు

జమ్మికుంట రూరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖకు సంబంధించిన ఐదు వందల కిలోల కాపర్ వైరు చోరీ కేసులో ఇద్దరి వ్యక్తులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ చోరీ వివరాలను వెల్లడించారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని దుర్గాకాలనీలో గల ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ గోదాంలో రైల్వే శాఖకు సంబంధించిన జయంత్ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన రూ.4.50లక్షల విలువ గల ఐదు వందల కిలోల కాపర్ వైరు నిల్వ చేశారు. ఎల్‌బీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బండవత్ సందీప్, దేవరకొండ జిల్లాకు చెందిన బాలుతో కలిసి ఈనెల 29న గోదామ్ షెట్టర్ తాళాలు పగులగొట్టి ఐదు వందల కిలోల వైరు ఎత్తుకెళ్లారు. దొంగలించిన వైరును కీసర మండలం నాగారంకు చెందిన పాత సామన్లు కొనుగోలు చేసే హేమ కనుకయ్యకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గోదామ్ ఇన్‌చార్జి జగదీష్‌దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేపట్టారు. 48గంటల వ్యవధిలో సందీప్, కనుకయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వైరు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ ఆరోగ్యం, హెడ్ కానిస్టేబుళ్లు మోహన్, సదయ్య, సంపత్, కానిస్టేబుల్ వేణు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆలయంలో చోరీ

కోరుట్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గంగమ్మ దేవాలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారులోని ఆలయంలోకి భక్తులు శుక్రవారం ఉదయం వెళ్లగా ఆలయానికి వేసిన తాళం పగుల గొట్టి ఉండడంతో పాటు ఆలయంలోని వస్తువులు చిందరవందగా పడి ఉండడాన్ని భక్తులు గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. ఆలయంలో గంగమ్మ తల్లిపై ఉన్న ఆర తులం బంగారు అభరణాలతో పాటు హుండీలో ఉన్న నగదు దోచుకపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయంపై పోలీసులకు వివరణ అడుగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి డీఎస్పీ

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామంలో గత నెల 30న భార్య సునీత(26)ను హత్య చేసిన భర్త రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివ రాలను మెట్‌పల్లి డీఎస్పీ ప్రెస్‌నోట్ ద్వారా వివరాలు రిలీజ్ చేశారు. మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామానికి చెందిన వెలుమల రమేష్‌కు 2015లో అల్లీపూర్ గ్రామానికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీ రికి కొడుకు, కూతురు ఉన్నారు. రమేష్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన రమేష్ నెల రోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. అప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్య సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందని చేయి చేసుకునేవాడు. అదే అనుమానంతో గత నెల 30న ఉదయం భార్యపై దాడి చేశాడు. అనంతరం గొంతు పిసికి హత్య చేశాడు. సునీత తండ్రి మందుల గంగారాజం ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తుండగా గత నెల 31న నిందితుడు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలో ఉన్నట్లు తెలియడంతో అక్కడకు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మల్లాపూర్ ఎస్ఐ పబ్బ కిరణ్‌కుమార్ అక్కడకు వెళ్లి నిందితుడిని పట్టుకుని విచారించారు. భార్యను హత్య చేసి నట్లు నేరం ఒప్పు కోవడంతో అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేధించిన కోరుట్ల సీఐ, మల్లాపూర్ ఎస్ఐని డీఎస్పీ అభినందించారు.

జిల్లా కేంద్రంలో అగ్నిప్రమాదం

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని కస్తూరి స్ట్రీట్‌లో గురువారం రాత్రి ప్రమాదవాశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అమ్మాజీ డ్రెస్ మెటీరియల్‌తో పాటు మరో షాపులో ఒక్క సారిగా మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం దీపావళి పండుగ సందర్భంగా పేల్చిన టపాసుల నిప్పురవ్వతోనే ప్రమాదం జరిగిందని అమ్మాజీ డ్రెస్ మెటిరియల్ యజమాని ఆరోపించారు. రూ. 30 లక్షలకు పైగా డ్రెస్ మెటీరియల్‌తో పాటు ఫర్నీచర్ తదితర వస్తువుల ఆస్తి నష్టం జరిగిందని వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్క దాడి

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడలో గురువారం ఓ వృదురాలిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. రాజవ్వ తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కుక్క దాడి చేయడంతో చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెట్‌పల్లిలో ఆవుల బీభత్సం..

- ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ రోడ్ వాసవి టెంపుల్ ఎదురుగా రోడ్డుపై ఆవులు బీభత్సం సృష్టించాయి. మార్కెట్ రోడ్డులో రెండు ఆవుల కుస్తీకి దిగాయి దీంతో అటు వైపు వెళ్తున్న వాహనాలకు ఆవులు తగలడంతో ఓ వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్ప గాయలయ్యాయి. ఆవులు కుస్తీకి దిగడంతో అక్కడ ఉన్న ప్రజలు భయందోళనకు గురయ్యారు. రోడ్లపై ఆవులు సంచరించకుండ అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్రికోటేశ్వరుడి సన్నిధిలో
జూనియర్ జడ్జిలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శుక్రవారం పల్నాడు జిల్లా కోటప్పకొండపై త్రికోటేశ్వరుడిని దర్శించుకున్నారు. కరీంనగర్ సివిల్ న్యాయమూర్తి రాజేశ్వర్, గోదావరిఖని సివిల్ న్యాయమూర్తి సచిన్‌రెడ్డి, దేవరకొండ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కేవీఎస్ హరీష్‌బాబు, భద్రాచలం సివిల్ న్యాయమూర్తి శివనాయక్, జడ్చర్ల సివిల్ న్యాయమూర్తి ముదాసీర్, నిజామాబాద్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ముదిరాజు సంఘం పెద్దల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముత్యాల మనోజ్‌రెడ్డి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో వాలీబాల్ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చాడన్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

దూరవిద్య డిగ్రీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

జమ్మికుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.

డీఏ బకాయిలను చెల్లించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లందరికీ డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17 విడతల్లో బకాయిలను చెల్లించడం దారుణమని, వాయిదాల పద్ధతిలోకి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను నెట్టవద్దని కోరారు.


శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

ఉద్యోగార్థులకు అండగా..
ఎస్సీ స్టడీ సర్కిల్

జగిత్యాల పట్టణంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు అండగా నిలుస్తోంది. ఉచితంగా మెటీరియల్ అందించడంతో పాటు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, లక్ష్యానికి చేరువులో మెరుగైన శిక్షణ అందిస్తూ కొలువులు సాధించడంలో నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ బాసటగా నిలుస్తోంది. విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ లైబ్రరీ, గ్రంథాలయం అందుబాటులో కూడా ఉన్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరియల్ కొనుగోలుకు అందిస్తున్నారు. శిక్షణ తీసుకున్న వారిలో ఇప్పటి వరకు సుమారు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారు.

- ఉచిత శిక్షణతో ఉద్యోగావకాశాలు
- నాలుగు బ్యాచ్‌లతో నాలుగువందల మందికి శిక్షణ
- పరీక్ష విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక
- సకల వసతులు, మెరుగైన ఫలితాలతో సక్సెస్‌ఫుల్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదు, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కోచింగ్ ఫీజులు, పుస్తకాల కోసం జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఉద్యోగం సాధించాలనే తపన, అందుకు తగ్గట్టుగా శ్రమ, సంకల్పం ఉంటే చాలు అభ్యర్థుల ఆశయాలకు అనుగుణంగా ఉచిత శిక్షణ అందిస్తోంది జగిత్యాల పట్టణంలోని బీట్ బజారులో గల ఎస్సీ స్టడీ సర్కిల్. సకల వసతులను ఉచితంగా కల్పిస్తూ, పోటీ ప్రపంచంలో పట్టణ, గ్రామీణ యువతను సమ ఉజ్జీలుగా నిలుపుతూ వారి ఉన్నత భవితకు బాటలు వేస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కొనసాగుతున్న కార్యక్రమాలు, విజయాలపై ప్రత్యేక కథనం...


తాత్కాలిక స్టడీ సర్కిల్ భవనం

● ఉద్యోగార్థులకు వెన్నుదన్నుగా...

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. జిల్లా కేంద్రంలో 2020 జనవరిలో ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లాలోని నిరుద్యోగులకు వరంగా మారింది. ప్రారంభించిన నాటి నుంచి నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ అందించారు. ఐదు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున, వంద మందికి శిక్షణ అందించారు.

● నాలుగు బ్యాచ్‌లు, 53 కొలువులు

జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నాలుగు బ్యాచ్‌లకు గాను సుమారు 400మంది ఉద్యోగార్థులకు శిక్షణను అందించారు. ఇందులో 53మంది ఉద్యోగార్థులు కొలువులు సాధించారు. ఆర్ఆర్‌బీలో-01, ఎస్ఎస్‌సీ-01, పోలీసుశాఖలో-10, టీచర్ పోస్టులు-10, జూనియర్ అసిస్టెంట్-02, ఏఈ ఎలక్ట్రిసిటీ-01, జూనియర్ లెక్చరర్-02, డిగ్రీ లెక్చరర్-01, ఎల్ఐసీ డీవో-01, లైబ్రేరియన్-02, గురుకుల -03, కేజీబీవీలో-02 ఉద్యోగాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

● ఉచితంగా మెటీరియల్ పంపిణీ

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ కోసం విద్యార్థులను పరీక్ష విధానం ద్వారా ఎంపిక చేస్తారు. ఎస్సీలకు 75శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు కలిపి 15శాతం కేటాయిస్తూ, ఓరల్ రిజర్వేషన్‌లో 33శాతం మహిళలకు కేటాయిస్తూ ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు శిక్షణతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరి యల్ కొనుగోలుకు అందిస్తారు.

మూడు ఉద్యోగాలు సాధించా
మంద మధుకర్, బీర్‌పూర్ మండలం తుంగూరు వాసి.

మాది బీర్‌పూర్ మండలం తుంగూరు గ్రామం. తండ్రి వ్యవసాయ కూలి, తల్లి బీడీ కార్మికురాలు. జగిత్యాల లోని బీట్‌బజార్‌లో గల స్టడీ సర్కిల్‌లో ఐదు నెలలు ఉచిత శిక్షణ పొందాను. ఈ శిక్షణ ద్వారా రైల్వే డీఎస్సీ-2024లో ఎస్జీటీ, గ్రూప్-4 లో మూడు ఉద్యోగాలు సాధించాను.



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా
నరేష్ కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్, జగిత్యాల

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టడీ సర్కిల్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. శిక్షణ ద్వారా 53 మంది కొలువులు సాధించారు.



ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి
రాజ్‌కుమార్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి, జగిత్యాల జిల్లా

స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నాం. నవంబర్‌లో నూతన బ్యాచ్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని కొలువులు సాధించాలి.



పక్కా భవనం కోసం స్థల కేటాయింపు
సత్యప్రసాద్, జగిత్యాల కలెక్టర్

జగిత్యాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ పక్కా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాం. నిధులు కేటాయింపునకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన తదుపరి భవనం నిర్మాణం చేసి, వసతులు కల్పిస్తాం. బ్యాచ్‌లు ప్రారంభం కాగానే క్రమం తప్పకుండా స్టడీ సర్కిల్‌ను సందర్శించి మౌలిక వసతులు కల్పిస్తాం.



రాజన్న క్షేత్రంలో దీపావళి వేడుకలు


అంబారీ సేవపై స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు పూజలు చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను అంబారీ సేవపై ఊరేగించారు. సూపరింటెండెంట్‌లు నర్సయ్య, నరేందర్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ఎస్పీ

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎస్పీ అఖిల్‌మహాజన్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ నర్సయ్య ప్రసాదాన్ని అందజేశారు.

భక్తులు రద్దీ.. : వేములవాడ రాజ రాజేశ్వరస్వామిని గురు, శుక్రవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

ధర్మపురిలో దీపాలంకరణ
ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆలయంలో దీపాలంకరణ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దీపావళి పండుగ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ధన లక్ష్మీపూజలు జరిపారు. యాగ శాల వద్ద లోక క్షేమార్థం నిత్య హవనం కార్యక్రమాలు జరిపారు. రాత్రి ప్రధాన ఆలయంలో సహస్ర దీపాలంకరణ జరిపారు. ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలంకరించారు. స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో కూడ దీపాలంకరణ చేశారు. సాయంత్రం స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంతిపూల తోట



బంతి సాగు.. భలే బాగు

- మూడపల్లిలో బంతిపూల సాగు చేస్తున్న యువ రైతు
- కూరగాయల స్థానంలో బంతిపూదోట

చందుర్తి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలతోపాటు సీజనల్ పంటల సాగు చేస్తున్నాడు చందుర్తి మండలం మూడపల్లికి చెందిన యువ రైతు గోలి శ్రీనివాస్. రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం మూడపల్లికి చెందిన శ్రీనివాస్ తనకు ఉన్న 3 ఎకరాల భూమిలో రెండు ఎకరాల్లో వరి, 30 గుంటల్లో బంతి పూలతోట, 10 గుంటల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు. పంట మార్పిడిలో భాగంగా సీజనల్ పంట సాగు కింద సుమారు 30 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు చేపట్టారు.

ఈ ఏడాది జూలైలో కరీంనగర్‌లోని నర్సరీలో సుమారు 2500 మొక్కలు కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటాడు. మొక్కలు నాటేందుకు కూలీల ఖర్చు అంతా కలిపి రూ.14,000 వేల వరకు వచ్చింది. క్రిమి సంహారక మందులకు రూ.3000 వరకు ఖర్చయ్యింది. జూలైలో నాటగా బతుకమ్మ, దసరా పండుగల నాటికి మొదటిసారి సుమారు 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, కిలో రూ.100 విక్రయించానని రైతు తెలిపాడు. మొదటి పర్యాయంలోనే పంట పెట్టుబడి చేతికి వచ్చిందన్నాడు. డిసెంబరు చివరనాటికి ఇలా మూడు పర్యాయాలు పూలు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం రెండోసారి పూలు కోయడానికి సిద్ధంగా తెలిపాడు. హోల్‌సేల్‌గా కాకుండా రిటైల్‌గా తోట వద్ద పూలకు గిరాకీ ఉంటుందని యువరైతు పేర్కొంటున్నాడు.

మొదటి ప్రయత్నంగా బంతి సాగు
గోలి శ్రీనివాస్, యువరైతు, మూడపల్లి

బంతి పూలు సాగు చేసిన 30 గంటల భూమిలో గతంలో కూర గాయలు సాగు చేశాం. పంట మార్పిడిలో బంతి పూలు సాగు చేద్దామనే ఆలోచన వచ్చింది. ఇందు లో భాగంగా మొదటి ప్రయత్నంలో బంతి పూల సాగు చేపట్టాం. కిలో బంతిపూలను రూ.80 నుంచి రూ.100 విక్రయిస్తున్నాం. పెద్ద పరిమాణంలో తీసుకుంటే హోల్‌సేల్ ధరకు అమ్ముతున్నాం. అన్ని ఖర్చులు పోను మూడు దిగుబడులకు కలిపి రూ.50 వేల వరకు లాభం వస్తుందని ఆశిస్తున్నాం.



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


జిగీష

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని కే జిగీష రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజురెడ్డి, రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ కృష్ణ జిగీషను అభినందించారు. అక్టోబరు 29న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిగీష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం నుంచి ఈ నెల 4వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొననుంది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులాలవారీగా లెక్కతేలితేనే
సమన్యాయం

- సర్వేకు సహకరించాలి
- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- సమగ్ర సర్వే ఏమైందో దేవుడికే తెలియదు...
- చిత్తశుద్ధితో చేస్తున్న సర్వేతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్


కమిషన్ ముందు మోకరిల్లి తన గోడును వెల్లబోసుకుంటున్న బీసీ సంఘం ప్రతినిధి కానుగంటి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా కులాలవారిగా లెక్కతేలితేనే సమన్యాయం జరుగుతుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, అధికారుల సమక్షంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కులసంఘాలు, ఉప కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌కు అభ్యర్థనలను, సూచనలను ఇచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

● వినతుల వెల్లువ

తాపీమేస్త్రీగా పనులు చేస్తూ సంచార జాతులుగా జీవిస్తున్న తమను బీసీ-డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులో చేర్చాలని ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్ కోరుతూ కమిషన్ ముందు మోకాళ్లపై కూర్చొని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇలా మోకరిల్లడ మేమిటి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూనే న్యాయం జరిగేందుకు కృషిచేస్తామని చెప్పారు.

- రెండు లక్షల జనాభా కలిగిన గాండ్లతిల సంఘం కులవృత్తి గానుగపై నూనె తయారు చేయడం పూర్తిగా కనుమరుగైందని, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, రెడ్డిగాండ్ల కులస్తులను తమ గ్రూపు నుంచి తొలగించాలని ఆ సంఘం అధ్యక్షుడు జక్కం సంపత్ కోరారు.
- ముస్లిం రిజర్వేషన్లను 4 నుంచి 12శాతానికి పెంచాలని, ముస్లిం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ముఫ్తీ గయాస్ కోరారు.
- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలైన కమ్మరి, వడ్రంగి, కంచరం, శిల్పి, స్వర్ణకార వృత్తులవారిని ఆయా కులాలుగా పేర్కొంటున్నా రని, వారందరిని విశ్వ బ్రాహ్మణులు ఒకే కులంగా పరిగణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- నిర్మాణ రంగంలో పనిచేస్తూ జీవించే సగరఉప్పర కులస్తులను బీసీ-డి నుంచి 'ఏ'లోగానీ, ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ బాధ్యులు కోరారు.


కమిషన్ సభ్యులతో వాగ్వాదానికి దిగుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

- గంగపుత్రబెస్త కులాన్ని సంప్రదాయ మత్సకారులుగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా బీసీ నుంచి ఎస్సీల్లో చేర్చాలని ఆ సంఘం ప్రతినిధి మోసం అంజయ్య వినతిపత్రం అందించారు.
- ముస్లింలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని, నూర్‌బాషా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి దూదేకులకు ఆర్థికసహాయాన్ని అందించాలని దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు బాబుజానీ కోరారు.
- ముస్లింలలోని ఉప కులస్తుందరికీ 4శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని, ఆలయాలు, మసీదులపై దాడులు జరుగకుండా కఠినచట్టాలను అమలులోకి తేవాలని, వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు తాజొద్దీన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమిస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకునేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సమద్‌నవాబ్ బీసీ కమిషన్‌ను కోరారు.
- ఎంఐఎం అధ్యక్షుడు గులాంఅహ్మద్ హుస్సేన్ ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.
- నీరాకేఫ్‌లు ఏర్పాటు చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు.
- ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ దామాషా ప్రకారంగా బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్‌రజక, శ్రీకాంత్ కోరారు. తమకు ఆర్థిక సహాయాన్ని అందించి స్వయం ఉపాధి కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫకీర్ల సంఘం అధ్యక్షుడు కోరారు.

కోర్టు ఆదేశాలను గౌరవిస్తాం



గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఎందుకు చేసిందో.. ఆ వివరాలు ఎక్కడ ఉన్నాయో దేవుడికే తెలుసని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 9న స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అడిగితే అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదన్నారు. ప్రస్తుతం చేపడుతున్న కుల గణన సర్వే ఓపెన్ సీక్రెట్ అని దాన్ని బహిర్గతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల ఖరారు విషయంలో ప్రత్యేక కమిషన్‌ను 15రోజుల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందనే సమాచార ముందని, అయితే దీనికి సంబంధించిన తీర్పు వివరాల ఆర్డర్ కాపీ మాకు ఇంకా అందలేదని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తామన్నారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్, న్యాయనిపుణుల సలహాల మేరకు కోర్టు ఉత్తర్వులను పాటిస్తూ ముందుగా ప్రకటించిన మేరకు ఈ నెల 13 వరకు బీసీ కమిషన్ పర్యటన కొనసాగుతుందని చెప్పారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేని బీసీ కమిషన్ ఎవరికీ భయపడకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చిత్త శుద్ధితో నివేదిక ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు సత్యప్రకాశ్, రంగు బాలలక్ష్మి, తిరునగరి సురేందర్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణలో గందరగోళం

కరీంనగర్ టౌన్: బీసీ రిజర్వేషన్ల అభిప్రాయ సేకరణపై కాసేపు గందరగోళం నెలకొంది. అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కొత్తపల్లి మున్సిపల్‌చైర్మన్ రుద్ర రాజు తదితర నాయకులతో కలిసి బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులకు వినతిపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. అయితే చట్ట ప్రకారం చెల్లుబాటుకాని పద్ధతిలో కుల గణన చేస్తున్నారని, 15 రోజుల్లో ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసినా ఎందుకు ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందంటూ మాట్లాడటంతో సమావేశంలోని బీసీ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నారంటూ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. దీనితో కొద్దిసేపు గందరగోళం నెల కొన్నది. వెంటనే కమిషన్ చైర్మన్ నిరంజన్ జోక్యం చేసుకొని నిరసన కారులు వెళ్లి తమ సీట్లలో కూర్చోవాలని, వారి అభిప్రాయాలను చెబుతున్నారని, అడ్డుకోవద్దంటూ సర్దిచెప్పారు. అయినప్పటికీ ఎమ్మెల్యే ఎంతసేపు రాజకీయాలు మాట్లాడతారంటూ ఆందోళన చేయగా పోలీసులు వారిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా చైర్మన్ నిరంజన్ పోలీసులు అక్కడి నుంచి వెళ్లి పోవాలని, మీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూడా మాట్లాడేందుకు ప్రయత్నించగా అనుమతించలేదు. ఈ సందర్భంగా సంజయ్, కౌశిక్ కొంత అసహనం వ్యక్తం చేసినప్పటికీ వారికి అనుమ తించక పోవడంతో వారు వేదిక నుంచి దిగి వెళ్లిపోయారు.

న్యూస్ బాక్స్

నియామకం

ఎలిగేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు న్యాతరి పోచయ్యను గురువారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రకటించారు. కార్యదర్శి నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనే రాజేష్, రాష్ట్ర నాయకుడు బింగి రాజుకు పోచయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చార్జీల పెంపుపై సంబరాలు

కోల్‌సిటీ టౌన్,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం డైట్ కాస్మోటిక్ చార్జీల పెంపుపై శుక్రవారం గోదావరిఖనిలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ గురుకుల జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు డైట్ చార్జీలను రూ.1500 నుంచి 2100 లకు, కాస్మోటిక్ చార్జీలు 275లకు పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సుల్తానాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం విద్యాలయంలో ఈ మేరకు కేక్ కట్ చేసి విద్యార్థులు పంచుకున్నారు. విద్యార్థుల శ్రేయస్సు, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఎంతో ఉదారంగా డైట్ చార్జీలను పెంచారంటూ విద్యార్థులు సీఎం, డిప్యూటీ సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

పాలకుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని రైతులకు శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారులు వాతావరణ ఆధారిత సూచనలను చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచనల మేరకు ఏఈవోలు శశిధర్, యోజనలు పాలకుర్తి, జయ్యారం తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అకాల వర్షాలపై సలహాలు, సూచనలు అందజేశారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం ఈనెల 3న బంధంపల్లి స్వరూప గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించ తలపెట్టినట్లు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సమావేశానికి ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. కాపు సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అనుమాల మహేష్, యువత రామగిరి మండలం అధ్యక్షుడు చీటి సందీప్, సికింద్రాబాద్ నియోజకవర్గ మున్నూరు కాపు యువత అధ్యక్షులు బాలకృష్ణ, పూదరి కిషన్ పాల్గొన్నారు

ఎమ్మెల్యే అభినందనలు

సుల్తానాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నర్సయ్యపల్లికి చెందిన జూపల్లి తిరుమల్ రావు, సాంబయ్యపల్లికి చెందిన లక్ష్మారెడ్డిలను ఎమ్మెల్యే విజయరమణారావు అభినందించారు. శుక్రవారం ఎమ్మెల్యే సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు తదితరులను కలిశారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి ఘన నివాళి



గోదావరిఖనిలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాలనీలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని టీపీసీసీ కార్యదర్శి కాల్వ లింగస్వామి అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గాంధీనగర్‌లోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దాసరి విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, బాలరాజ్‌కుమార్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, పెండ్యాల మహేష్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, దూళికట్ట సతీష్, రవి, అరవింద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, జక్కుల దామోదర్‌రావు, ఆకుల రాజిరెడ్డి,చక్రపాణి, మార్క రాజు, అనుము రాములు, సారయ్య నాయక్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



మడకలో ఇందిరా గాంధీ వర్ధంతిని నిర్వహిస్తున్న నాయకులు

● ఓదెల (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలోని మడకలో గురువారం కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోసిక రాజేశం, నోములో మాధవరెడ్డి, నోముల సదాశివరెడ్డి, తూడి రాజయ్య, నర్సయ్య, గోసిక శ్రీనివాస్, నేదునూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబేద్కర్ చౌక్‌లో గురువారం భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కోరుకంటి వెంకటేశ్వర్ రావు, తాటిపల్లి రమేష్‌బాబు, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, సింగిరెడ్డి రాంచంద్రరెడ్డి, బూరల్ల వెంకటసత్యం, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, బాలసాని పర్శంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బావికి రక్షణ కరువు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



తాగునీటి బావిలో పడి మృతిచెందిన నక్క

ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం గోపాలరావుపేట గ్రామంలోని తాగునీటి బావికి రక్షణ కరువైంది. గురువారం బావిలో నక్క పడి నీరు కలుషితమైంది. ఉదయం నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులకు వాసన రావడంతో అనుమానం వచ్చి బావి దగ్గరికి వెళ్లి చూడగా, అందులో నక్క చనిపోయి ఉంది. దీంతో సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించగా ఎవరూ ఫోన్లు తీయలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు గ్రామస్థులంతా కలిసి నక్కను బయటకు తీశారు. ఇంతకుముందు కూడా ఇలాగే పాములు, పిల్లి పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ అధికారులు, పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇన్ని సంఘటనలు జరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు బావి చుట్టూ కంచె నిర్మించలేరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి బావి చుట్టూ జాలి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

బావి చుట్టూ జాలి ఏర్పాటు చేయాలి

- రాజకుమారి, గోపాల్‌రావుపేట

మా నల్లాల బావిలో ఎప్పుడు ఏదో ఒక్కటి పడుతోంది. ఒకసారి రెండు పాములు పడ్డాయి. మరొకసారి పిల్లి పడి నెల రెండు నెలలు నీళ్లు రాలేదు. ఇప్పుడు నక్క పడ్డది. నాలుగు రోజులుగా ఆ నీళ్లే తాగుతున్నాం. ఎప్పుడు మాకు ఇలాగే అవుతోంది. అయి నా ఎవరు పట్టించుకున్నది లేదు. ఇప్పటికైనా బావి చుట్టూ జాలి ఏర్పాటు చేయాలి.

నల్లాల ఆపరేటర్‌కు ఆరోగ్యం బాగాలేదు

- అహ్మద్, గోపాల్‌రావుపేట సెక్రెటరీ

పంపు ఆపరేటర్‌కు ఆరోగ్యం బాగా లేదు. దీంతో వేరేవాళ్లు పని చేస్తున్నారు. ఇటీవల మీటింగులకు ఎక్కువగా అటెండ్ కావడం వల్ల నేను చూడలేకపోయాను. గురువారమే బావి నుంచి జంతువును తీశాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడుతాం.

పూచీకత్తులో జాప్యం..

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు గ్యారంటీలు ఇంకా సమర్పించలేదు. దీపావళి పండుగ తర్వాత కొనుగోళ్లు ముమ్మరం అవుతాయని అధికారులు చెబుతున్నారు. కానీ ధాన్యం అంతా కేంద్రాల్లోనే ఉంది. నాలుగు రోజుల నుంచి జిల్లాలో వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా వారం రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ధాన్యం తడవడంతో పాటు కోతకు వచ్చిన పొలాలు నేల వాలుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 25శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం సత్వరమే స్పందించి ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేయాలని రైతులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

పెద్దపల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెద్దకల్వల నోబెల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శశికుమార్ జాతీయస్థాయి చేస్బో బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. పంజాబ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రాజా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ మోహన్ రాజా, ప్రిన్సిపాల్ ప్రణీత, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈర్ల సురేష్ అభినందించారు.

హోం గార్డుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్

ఓదెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంపులలో శుక్రవారం సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హోంగార్డుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సకినాల నారాయణను అరెస్ట్ చేసి సీఐ కార్యాలయానికి తరలించారు. రాష్ట్రంలో హోంగార్డుల సమస్యల పరిష్కారం కోసం శనివారం హైదరాబాదులో నిరాహార దీక్ష చేస్తున్నట్లు నారాయణ ప్రకటించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో గుంపులలోని తన ఇంటిలో ఉన్న నారాయణను అరెస్ట్ చేశారు. అయితే నారాయణను అదుపులోకి తీసుకున్న సంఘటన పోలీస్ అధికారులు గోప్యంగా ఉంచారు.

వాహనాలను మంజూరు చేయాలి

కళ్యాణ్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మృతదేహాలను తరలించే వాహనం లేక చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని డీహెచ్‌పీఎస్ నాయకులు మద్దెల దినేషన్ శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ట్విట్టర్‌లో వినతిపత్రం అందజేశారు. రామగుండంలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ వంటి పరిశ్రమలు ఉన్నాయని, వివిధ కారణాలతో మృతిచెందుతున్న వారిని ఆసుపత్రి నుంచి ఇంటికి తరలించేందుకు ఉచిత పార్థివదేహాల తరలింపు వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. పేరుకే పెద్ద ఆసుపత్రి అయినా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కాల్వశ్రీరాంపూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన పెగడపల్లికి చెందిన అసంపెల్లి మహేందర్‌ను కాల్వశ్రీరాంపూర్ మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్‌లు శుక్రవారం సన్మానం చేసి అభినందించారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా రామగల్ల సురేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎనగంట రవి, శ్రీనివాస్, దర్శనాల రాజనర్సు, కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

కోల్‌సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 31వ డివిజన్ ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మురికి కాలువ కుంగిపోయి అందులో ఎక్స్‌కవేటర్ పడిపోగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేషన్ ఎస్ఈ శివానందం, ఈఈ రామన్‌ను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రధానకాలువ నిర్మాణపనులు చేపట్టాలని, దీనికి శాశ్వత నిర్మాణాలు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంథని ట్రాన్స్‌కో ఏఈ ఐ. కనుకయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల దృష్ట్యా మంథని 33/11 కేవీ, గుంజపడుగు, నాగారం, గోపాల్‌పూర్, వెంకటాపూర్, బిట్టుపల్లి, ఎక్లాస్‌పూర్, ఖమ్మంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ కెవికె కళాశాల సమీపంలోని ఎర్ర ఇసుకను కొంతమంది అక్రమంగా రవాణాచేస్తున్నారని రామగిరి ట్రాక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్ర ఇసుకను ఇటిక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేషనల్ హైవే మంజూరుకు కృషి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే మంజూరుకు కృషి చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కిష్టంపేట మాజీ సర్పంచ్ కాసర్ల తిరుపతిరెడ్డి వినతి పత్రం శుక్రవారం అందజేశారు. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఘన్‌పూర్, ములుగు వరకు నేషనల్‌హైవే నిర్మించడంతో పాటు కిష్టంపేట బొర్నపల్లి మధ్యన ఉన్న మానేరు వంతెన కూడా నిర్మించాలని కోరుతూ బండి సంజయ్‌కి వినతి పత్రం అందజేసినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ హైవే నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రికి ప్రతిపాదనలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. 2017లో మానేరుపై వంతెన కోసం కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ ప్రభావిత గ్రామాల అభివృద్ధి కింద 63కోట్లు మంజూరు చేసిందని, ఈ విషయంపై స్పందించి హైవే రోడ్డుతో పాటు వంతెన నిర్మాణానికి, నిధుల మంజూరుకు సహకరించాలని కోరారు.

పేద కుటుంబాలకు చేయూత

ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైరా స్వప్నకు వెన్నుపూస ఆపరేషన్ అయ్యి ఇంటికే పరిమితం కాగా కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ బియ్యాన్ని అందజేసింది. శుక్రవారం మండల కేంద్రానికి చెందినా రేష్మా బాబాకు కుట్టు మిషన్ ఫౌండేషన్ ఇన్‌చార్జి నాగరాజు అందజేశారు. ఈగం ప్రసాదు, వెముళ్ళ సుభాష్, విజేయ్, కొలిపాక రాధిక, ఇప్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసం భజన

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శీలేశ్వర-సిద్దేశ్వరాలయంలో భజన కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9వరకు భజన ఉంటుందన్నారు.

దేవునిపల్లి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లిలోని లక్ష్మీనంబులాద్రి స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీ నంబులాద్రి స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని ఎమ్మెల్యే శుక్రవారం దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు పూర్ణకుంభ స్వాగతంపలికారు. ప్రదక్షిణ అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ అట్ల కుమార్ స్వామి యాదవ్, పొలవేని కుమార్, ఎనగందుల నారాయణ, ప్రదీప్, వేణు, సుదాకర్ రావు, దుగ్యాల సంతోష్ రావు, సంపత్ రావు, రామస్వామి, అట్ల నవీన్, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



స్కూళ్లను సందర్శించిన ఎడ్యుకేషన్ సెక్రెటరీ

గోదావరిఖని, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ గోదావరిఖని సెక్టార్-2 పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలను పరిశీలించిన అయన, ఉపాధ్యాయ బృందంతో సమావేశమయ్యారు. విద్యార్థుల హాజరు శాతం, పదిలో సాధించిన ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా శ్రద్ధతో పని చేయాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం పెంచడం, విద్యార్థులు మంచి నడవడితో ఉండేలా దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. గుండా శ్రీనివాస్ వెంట హెచ్‌ఎం శ్రీనివాసు, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి) : యైటింక్లయిన్‌కాలనీలోని సింగరేణి స్కూల్‌ను శుక్రవారం ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ సందర్శించారు. పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి జరుగుతున్న పనుల పురోగతిని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన ఆధునికీకరణ పనులను పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో గుండా శ్రీనివాస్ సమావేశమయ్యారు. విద్యార్థులకు చదువుతో పాటు జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ, ఉత్తమ పౌరులుగా ఎదిగేలా ప్రవర్తించడం వంటి అంశాలను అలవాటు చేయాలని సూచించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. సీబీఎస్ఈ అమలుకు అవసరమైన నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం పాఠశాలలో జరుగుతున్న పనుల వివరాలను గుండా శ్రీనివాస్‌కు వివరించారు.

ఆర్జీ-3లో 119 శాతం ఉత్పత్తి

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఉత్పత్తి వివరాలను జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు శుక్రవారం వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ఆర్జీ-3 డివిజన్‌కు అక్టోబరు మాసంలో నిర్దేశించిన 4.39 లక్షల టన్నులకు 5.22 లక్షల టన్నులతో 119 శాతంతో సాధించిందని పేర్కొన్నారు. ఓబీలో నిర్దేశించిన 42.70 లక్షల క్యూబిక్ మీటర్‌లకు 37.65 శాతంలో సాధించి 88 శాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు. గనుల వారీగా చూస్తే ఓసీపీ-1, 113 శాతం, ఓసీపీ-2, 126 శాతం ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు. ఏపీఏ డివిజన్‌కు అక్టోబరు మాసంలో నిర్దేశించిన 0.08 లక్షల టన్నుల లక్ష్యానికి 0.26 లక్షల టన్నులు సాధించి 315 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 0.16 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. సమష్టి కృషితో సింగరేణి ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని జీఎంలు కోరారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రకాష్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం యూనియన్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై యూనియన్ పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. 1920 అక్టోబరు 31న ముంబైలో లాలాలజపతిరాయ్ అధ్యక్షతన యూనియన్ స్థాపించబడినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వైస్‌ప్రెసిడెంట్ ప్రకాష్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చేవరకు బ్రిటీష్ పాలకుల హయాంలో కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఏఐటీయూసీ, పేమెంట్ యాక్టు, ప్రమాదబీమా యాక్టు, ట్రేడ్ యూనియన్ యాక్టు, మినిమం వేజ్ యాక్టు, ఐడీ యాక్టు వంటి 18 చట్టాలను సాధించినట్టు ప్రకాష్ పేర్కొన్నారు. స్వాతంత్ర అనంతరం 26 చట్టాలను సాధించడంలో ఏఐటీయూసీ పాత్ర ఉన్నట్టు తెలిపారు. ఏఐటీయూసీకి అనుబంధంలో సింగరేణిలో 1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భవించినట్టు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు వేజ్‌బోర్డులు, ఇంక్రిమెంట్లు, అలవెన్స్‌లు, పండుగ అడ్వాన్సులు, ప్రమోషన్ పాలసీలు, లాభాల వాటా ఏఐటీయూసీ సాధించిన విజయాలు అని ప్రకాష్ పేర్కొన్నారు. ఏడుసార్లు గుర్తింపు సంఘం ఎన్నికలు జరగగా నాలుగు సార్లు గుర్తింపు హోదా కట్టబెట్టి కార్మికులు యూనియన్‌ను ఆదరించారని అన్నారు. గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా కార్మికుల పక్షాన నిలుస్తున్న యూనియన్‌గా ఏఐటీయూసీ నిలిచిందని అన్నారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ సెక్రెటరీ రాజారత్నం, నాయకులు జీ రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్, బుర్ర తిరుపతి, మహేందర్, నర్సయ్య, అల్లి రమేష్, కుమారస్వామిలు పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్‌తో ఆటోడ్రైవర్ల బతుకులు ఆగం..

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చాకే ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణలో ఆటోడ్రైవర్లు జీవించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చందర్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల యూనియన్ జేఏసీ చలో లోహైదరాబాద్ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి ఆటోడ్రైవర్‌కు జీవన భృతి కల్పిస్తామని, సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని కానీ అమలుకు నోచుకోలేదన్నారు. 6గ్యారెంటీల అభయ హస్తం పథకంలో మహిళల ఉచిత బస్సుతో ఆటోడ్రైవర్ల జీవనోపాధి కరువయ్యిందని పేర్కొన్నారు. ఆటో నడిపితేనే కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఆటో డ్రైవర్లదని, వారికి జీవన భృతిని కల్పించాలని డిమాండ్‌తో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టారని, ఆటోడ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెంట రాజేష్, బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నీలరపు రవి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణికుంట్ల సురేష్, నాయకులు సదానందం, కడార్ల శ్రీధర్, కోర్రి ఓదెలు, నామిండ్ల కుమార్, షరీఫ్, తిరుపతి, భైరి సంపత్, కొంరయ్య పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీలో చేరిక

పెద్దపల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక నాయకుడు పెర్క రాజమల్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొంకూరి సురేందర్ సన్ని ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి రాజమల్లుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సురేందర్‌రెడ్డిని సన్నీ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సగరులను బీసీ ఏలోకి మార్చాలి..

పెద్దపల్లిటౌన్, కమాన్‌పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సగరులను బీసీ డీ నుంచి బీజీ ఏలోకి మార్చాలని శుక్రవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కు లక్ష్మన్ వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీసీ కమిషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గాండ్ల మోహన్ దేవునూరి తిరుపతి, తాడిచెట్టు సదయ్య తదితరులు పాల్గొన్నారు

ఈద్గా కమిటీ చైర్మన్‌గా ఖాజా

మంథని, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఈద్గా,ఖబ్రస్థాన్ కమిటీ చైర్మన్‌గా ఎండీ ఖాజా మొయినుద్దీన్ ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలోని ముస్లిం మైనార్టీలు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా ఏజాజ్ మొహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా అక్బర్‌అలీ, కార్యదర్శిగా జహంగీర్, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ పర్వేజ్, ఎండీ గౌస్, కోశాధికారిగా ఇఫ్తిఖార్, లీగల్ అడ్వయిజర్‌గా మహబూబ్ అలీబేగ్, సయ్యద్ సిరాజుద్దీన్ ఎన్నికయ్యారు.